ఊరి మాట.. ప్రగతి బాట!



కదిరి మండలం సున్నపుగుట్టతండా వద్ద కొత్తగా నిర్మించిన నాలుగురోడ్ల కూడలి

నల్లచెరువు మండలం నల్లజోడువారిపల్లికి ఇన్నేళ్లుగా రోడ్డు సౌకర్యం లేదు. గ్రామస్తులు అడవి మార్గం గుండా కాలి బాటన వారు మండల కేంద్రానికి వచ్చేవారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆ గ్రామానికి 108 వాహనం రావడం కూడా కష్టమే. అలాంటిది ఇప్పుడు 108 వాహనంతో పాటు ఎన్నో వాహనాలు ఆ గ్రామానికి రయ్..మని వెళుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ గ్రామానికి తారు రోడ్డు వేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల ఆనందానికి అవధులు లేవు. అందుకే ఊరంతా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారు.

- కదిరి నియోజకవర్గంలో పల్లె పల్లెకూ రహదారి
- గ్రామాల ముఖచిత్రాన్నే మార్చేసిన జగన్ ప్రభుత్వం
- రూ.843 కోట్లతో రహదారుల నిర్మాణం పూర్తి

కదిరి: కదిరి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందు వరకూ ఈ నియోజకవర్గంలో 300కు పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదంటే ఆశ్చర్యం వేయకమానదు. సరైన రోడ్లు లేక ఇక్కడి గ్రామీణ ప్రజలు ఇన్నేళ్లూ నరకయాతన పడ్డారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ నియోజకవర్గంలో దాదాపుగా ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం కల్పించింది. ఇప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా అందమైన రోడ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. కొత్తగా వేసిన రోడ్లతో ఎన్నో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి.

ప్రగతి బాట

కదిరి నియోజకవర్గంలో మొత్తం 735 గ్రామాలున్నాయి. వీటిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు 335 గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండేది కాదు. కదిరి నియోజకవర్గానికి సంబంధించి రహదారుల నిర్మాణం కోసం రూ.843.41 కోట్లు ఖర్చు చేసిందంటే జగన్ ప్రభుత్వం అభివృద్ధి విషయంలో తన ప్రాధాన్యతను చెప్పకనే చెప్పింది. రహదారి సౌకర్యం లేని 335 గ్రామాలకు గాను 325 గ్రామాలకు కొత్తగా రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది.

సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యత..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కదిరి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి విషయంలోనూ అంతే ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామీణ రహదారులు నిర్మించారు. గాండ్లపెంట మండలంలో 12 రహదారులు, తలుపుల మండలంలో 19, కదిరి మండలంలో 15, ఎన్‌పీకుంట మండలంలో 20, నల్లచెరువు మండలంలో 9, తనకల్లు మండలంలో 26 ఇలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా 101 గ్రామీణ రహదారుల పనులు దిగ్విజయంగా పూర్తి చేసింది. వీటి ద్వారా 300కు పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడింది.

నియోజకవర్గంలో నిర్మించిన రోడ్ల వివరాలు:

మొత్తం గ్రామాలు	735
కొత్తగా రోడ్లు వేసిన గ్రామాలు	325
నిర్మించిన రోడ్ల సంఖ్య	101
రోడ్ల కోసం ఖర్చు చేసిన నిధులు	రూ.843 కోట్లు

ఊరు మారింది

జగనన్నకు రుణపడి ఉంటాం



మా ఊరు అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉంటుంది. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లు కావొస్తున్నా మొన్నటి వరకూ మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. జగనన్న ప్రభుత్వం మా ఊరికి రోడ్డు వేసింది. అందుకే ఊరు ఊరంతా ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

–బి.రమణారెడ్డి, నల్లజోడువారిపల్లి, నల్లచెరువు మండలం

మా ఊరికి రోడ్డొచ్చింది



మా ఊరికి రోడ్డు వేయాలని ఎంతోమంది నాయకులను వేడుకున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమా అని మా ఊరికి రోడ్డు వచ్చింది. దీంతో ఊరు రూపు రేఖలే మారిపోయాయి. చుట్టుపక్కల పల్లెలన్నింటికీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

–బుక్యా కళావతమ్మ, తుమ్మలబైలు పెద్దతండా, గాండ్లపెంట మండలం

క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి



సూచనలు ఇస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. శనివారం ప్రశాంతిగ్రామంలో టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ నగేష్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంత ప్రాముఖ్యమో టీకాలు అంతే ముఖ్యమన్నారు. సమయానికి టీకాలు వేయించుకోవాలని ప్రభుత్వం వాటిని ఉచితంగా అందజేస్తున్నారన్నారు. గర్భిణులు గర్భస్థ పరిస్థితి, ఆహారం, ల్యాబ్ పరీక్షలు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది అపర్ణ, ప్రమీళ, అమృత, అనిత తదితరులుపాల్గొన్నారు.

తలసీమియా బాధితుడికి రక్తదానం



బాధితుడితో వలంటీర్ అనిల్‌కుమార్

బత్తలపల్లి: తలసీమియాతో బాధపడుతున్న ఓ బాలుడికి గ్రామ వలంటీర్ రక్తదానం చేశాడు. వివరాలు..అనంతపురానికి చెందిన జాఫర్, రహిమా దంపతుల కుమారుడు నూర్ మహ్మద్ తలసీమియాతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఆర్డీటీ ఆసుపత్రికి వచ్చిన వారు రక్తం కోసం ప్రయత్నించారు. అయినా రక్తం దొరకకపోవడంతో చివరకు గంటాపురం గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ పామాల అనిల్‌కుమార్‌కు ఫోన్‌లో సంప్రదించారు. స్పందించిన ఆయన తన గ్రూపు రక్తం(బీ పాజిటివ్) ఇచ్చి బాలుడికి అవసరమైన రక్తాన్ని ఆర్డీటీ బ్లడ్ బ్యాంకు ద్వారా ఇప్పించాడు. బ్లడ్ బ్యాంకు అధికారులు, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచు అక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట కాటమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డితో పాటు పలువురు వలంటీర్‌ను అభినందించారు.

ప్రభుత్వ స్థలాల్లో పనులు చేయొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రకుమార్

ఎన్‌పీకుంట: ప్రభుత్వ స్థలాల్లో జేసీబీతో మట్టి తవ్వకం, చదును చేయడం తదితర పనులు చేయొద్దని తహసీల్దార్ నరేంద్రకుమార్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జేసీబీ, ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లతో పోలీసుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండల కేంద్రం సమీపంలోని ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా జేసీబీలతో ప్రభుత్వ స్థలాలను చదును చేయించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఆక్రమణదారులకు జేసీబీ యజమానులు సహకరించడం నేరమన్నారు. ప్రభుత్వ భూములను చదును చేసే సమయంలో సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందారా? లేదా? అనే విషయాన్ని తెలుసుకొని పనులు చేయాలని సూచించారు. జమేదార్ నూర్‌మహమ్మద్, వీఆర్‌ఓలు దీపిక, రఘు, కిష్టప్ప పాల్గొన్నారు.

మక్బూల్‌ను కలిసిన నాయకులు



మక్బూల్‌అహ్మద్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఎన్‌పీకుంట: వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీ.ఎస్.మక్బూల్‌అహ్మద్‌ను కదిరిలోని ఆయన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు బాలకృష్ణనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పంచాయితీల నాయకులు, కార్యకర్తలతో కలిసి మక్బూల్‌అహ్మద్‌ను దుశ్శాలువతో సత్కరించారు. రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని, ముచ్చటగా మూడవ సారి కదిరి గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ పాలగిరి బాబాఫక్రుద్దీన్, నాయకులు శ్రీరాములు, ఆటోకిష్టా, విజయారెడ్డి, బావాజి, మహేష్, రెడ్డప్ప, రామాంజులునాయుడు, కేశవరెడ్డి, రఘునాథ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను మైనార్టీ నాయకుడు పఠాన్ బాబాఖాన్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పార్లపల్లి గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సీఎం వైఎస్ జగన్ అంటే ఎనలేని అభిమానమని, కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరోసారి భారీ మెజారిటీలో గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. నాయకులు కరీంఖాన్, జబీవుల్లా ఖాన్, రాంకిశోర్‌రెడ్డి, మస్నూర్ బాషా, నాగార్జున వేమనారాయణ, షబ్బీర్, జె. ఆంజనేయులు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే అస్త్రాలుగా ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం పుట్టపర్తి పార్టీ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి నల్లమాడ మండలం చారుపల్లి నుంచి ఎన్నికల ప్రచారం చేపడతామని తెలిపారు. గత 57 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి వివరించి ఓటు వేయాలని కోరతామన్నారు. కరోనా కష్ట కాలంలో సైతం పేదలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు ఆగకుండా అందించారన్నారు. నవరత్నాల పథకాల అమలుతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమైందన్నారు. అందుకే మరో సారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరాలన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం

పుట్టపర్తి అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేసి సీఎం జగన్‌కు బహుమతిగా ఇద్దామని ఎమ్మెల్యే నేతలు, కార్యకర్తలకు సూచించారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 32 వేలుపైచిలుకు మెజారిటీ వచ్చిందని, ఈ సారి అంతకంటే ఎక్కువ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలన్నారు. మా తాత, నాన్న, తాను మూడు తరాలుగా వైఎస్ కుటుంబంతో అనుబంధం ఉందని, ఊపిరి ఉన్నంత వరకు సీఎం జగన్ వెంటే నడుస్తానని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, బూత్ లెవల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

14న చలో సేవాఘడ్

ఓడీచెరువు: అనంతపురం జిల్లా గుత్తి మండలం సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఈనెల 14న చలో సేవాఘడ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏబీబీఎస్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణా నాయక్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13 నుంచి 15 వరకూ జయంత్యుత్సవాలు జరుగుతాయన్నారు. ఈనెల 14న లక్ష మంది గిరిజన గర్జన సభ నిర్వహిస్తామన్నారు. గిరిజనులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు మోహన్ నాయక్, బాబునాయక్, రత్నాభాయి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం/ధర్మవరం అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద విడుదలైన చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం ధర్మవరంలోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని కాకి శ్రీనివాసులుకు రూ.2లక్షలు, ముదిగుబ్బ మండలం ఎం.కొట్టాలపల్లి సుజాతకు రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.

- అలాగే పలువురికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పలువురికి తనవంతుగా ఆర్థికసాయం అందజేశారు. ఇందులో ముదిగుబ్బ మండలం బసిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించే రామాలయం నిర్మాణానికి రూ.50 వేలు విరాళమిచ్చారు. జొన్నలకొత్తలపల్లికి చెందిన బాధితులకు రూ.20 వేలు, ధర్మవరం పట్టణంలోని 16వ వార్డు లోనికోటలో ఆత్మహత్య చేసుకున్న చాంద్‌బాషా భార్య షకీలాకు రూ.20 వేలు, 21వ వార్డులో గుండెపోటుతో మృతి చెందిన ఈదుర్‌షావలి కుటుంబ సభ్యులకు రూ.20వేలు, అదే వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన బసోబి కుటుంబ సభ్యులకు రూ.20వేలు యర్రగుంటలో మిలటరీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



సిద్దరాంపురంలో ఓబిలేసు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఎనుములపల్లికి చెందిన స్టోర్ డీలర్, వైఎస్సార్‌సీపీ నేత మిద్దె మనోహర్‌రెడ్డి(52),బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప చిన్నాన్న, పార్టీ సీనియర్ నేత ఓబిలేసు(62)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నల్లమాడ: బసిరెడ్డిపల్లికి చెందిన నరసమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. గోపేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తోలేటి ఆదినారాయణరెడ్డి ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలు విరిగింది. వీరిద్దరూ పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, వంకరకుంట సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు ఓబిరెడ్డి, నాగప్ప, హైదరాబాద్ ఓబిరెడ్డి, తోలేటి శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

మృతుడికి నివాళి

వేళ్లమద్దికి చెందిన టీడీ చెన్నారెడ్డి(80) గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. శనివారం స్వగ్రామంలో కుటుంబ సభ్యులు పెద్దకర్మ నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై మృతుని సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని అల్లుడు సైకం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బొజ్జేనాయక్, నాయకులు టీడీ విజయభాస్కర్‌రెడ్డి, సీతారాం, హరి, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



పుట్టపర్తిలో రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



ధర్మవరంలో ఆర్టీసీ ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుట్టపర్తి అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని వక్తలు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని పలువురు ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. పుట్టపర్తిలోని డీపీటీఓ కార్యాలయంలో డీపీటీఓ మధుసూదన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో ప్రభుత్వ వైద్య సిబ్బంది చిట్టిబాబు, శిరీషబాను రక్త సేకరణ చేశారు. పుట్టపర్తి డిపో ఉద్యోగులు 18 మంది, కదిరి ఆర్టీసీ డిపో ఉద్యోగులు 14 మంది రక్త దానం చేశారు. ఈ సందర్భంగా డీపీటీఓ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ఉద్యోగులు రక్తదానం చేయడంతో ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. రక్తదానం ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనాయితుల్లా, డిపో సూపర్‌వైజర్లు విజయానంద బాబన్న, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని యువర్స్ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉచిత రక్తదానం, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్, డిపో మేనేజర్ సత్యనారాయణ పర్యవేక్షణలో డాక్టర్ నరసింహులు ఆర్టీసీ ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేషులు, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, కార్యదర్శి జయరాం, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలు జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శంకరనాయక్

పుట్టపర్తి: సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకరనాయక్ కోరారు. ఈమేరకు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జయంత్యుత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారా సమాజంతో పాటు యువత సేవాలాల్ చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. శంకరనాయక్ మాట్లాడతూ ఈ నెల 15న అనంతపురం జిల్లా సేవాఘడ్‌లో నిర్వహించే సేవాలాల్ జయంత్యుత్సవాలకు బంజారాలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన ప్రజాసమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్, నాయకులు భాస్కర్‌నాయక్, రామాంజినాయక్, సుమతీ భాస్కర్ నాయక్, హనుమంతునాయక్, శివనాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దాష్టీకం



నీరు లేకపోవడంతో చెరువులోని చేపలు మృత్యువాత పడిన దృశ్యం

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతులు బాగుండాలనే ఉద్దేశంతో చెరువులను కృష్ణా జలాలతో నింపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా చెరువుల్లో మత్స్యకారులు చేపలను వదలి జీవనం సాగిస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారు. చెరువుల్లో నీటిని జలచౌర్యం చేయడమే కాక వందలాది చేపలు మృత్యువాత పడటానికి కారకులవుతున్నారు. వివరాలు.. మండలంలోని పేరూరు పెద్దచెరువుకు సమీపంలో ఉన్న కొంత చెరువు భూమిని వరద అనే టీడీపీ సానుభూతిపరుడు ఆక్రమించాడు. ఆ భూమిలో అక్రమంగా మూడు బోర్లు వేసుకుని కొన్నేళ్లుగా నీటిని జలచౌర్యం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆ చెరువులో నీరులేక వందలాది చేపలు మృత్యువాత పడ్డాయి. మాజీమంత్రి పరిటాల సునీత అండచూసుకుని టీడీపీ నాయకులు ఇలాంటి దాష్టీకాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలచౌర్యం చేస్తున్న టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మత్స్యకార సంఘం సభ్యులు రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ వెంకటరమణను సంప్రదించగా.. తనకు జరిగిన విషయం తెలియదని సమాధానం ఇచ్చారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, జనార్దన్, మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

ధర్మవరం రూరల్: మండలంలోని గరుడంపల్లి వద్ద ఏర్పాటు చేసిన శ్రీ ధర్మశాస్త్ర కాశీనాయన ఆశ్రమం అభివృద్ధికి లక్ష్మీ శ్రీనివాస సిల్క్స్ యజయాని చందమూరి లత, చందమూరి సుబ్బిరెడ్డి దంపతులు రూ.42,111 విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం ఆశ్రమం అధ్యక్ష, ఉపాధ్యక్షులైన కనేకంటి శివారెడ్డి, చౌడప్పలకు నగదు అందించారు.

బాహావుద్దీన్‌కు పితృవియోగం



హుస్సేన్‌పీరాన్(ఫైల్)

కదిరి: వైఎస్సార్‌సీపీ కదిరి పట్టణ మాజీ అధ్యక్షుడు కేఎస్ బాహావుద్దీన్ తండ్రి కేఎస్ హుస్సేన్‌పీరాన్(89) శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కన్నుమూశారు. ఈయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి చేరారు. శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ ఈయనను ఆసుపత్రిలో కలిసి ఆరోగ్య విషయాలపై మాట్లాడారు. ఆ సమయంలో ఆయన మక్బూల్‌తో కరచాలనం చేయడంతో పాటు మరోసారి కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని అన్నారు. అయితే శనివారం ఉదయం ఆయన కన్నుమూశారన్న వార్త మక్బూల్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈయన భౌతిక కాయాన్ని మక్బూల్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర నేత బత్తల హరిప్రసాద్, ఇంకా పలువురు సందర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. ఈయన కోడలు దిల్షాదున్నీసా 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌గా ఉన్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్' సేవలు



పుల్లానారాయణపల్లిలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

తాడిమర్రి: పుల్లానారాయణపల్లి, భీమరాయునిపేట గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను నిర్వహించారు. పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి సిబ్బందితో కలసి వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, రోగులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు ఇంటింటా తిరుగుతూ దీర్ఘకాలిక రోగాలతో మంచం పట్టిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఏఎన్‌ఎం గాయత్రి, ఎంఎల్‌హెచ్‌పీ సుహాసిని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెరవేరిన ఎమ్మెల్యే హామీ



బోరు తవ్వకాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చారు. వివరాల్లోకెళ్తే..పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే పనులకు శ్రీకారం చుడుతూ గత నెలలో ఎమ్మెల్యే నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మసకవంకపల్లి బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఉన్నట్లు స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 10 రోజుల్లో బోరు వేయిస్తానని అప్పట్లో ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలుపుకొంటూ నూతనంగా బోరు వేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. శుక్రవారం రాత్రి గ్రామంలో బోరు తవ్వించగా నీరు సమృద్ధిగా లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి సర్పంచ్ అరుణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. రాంమోహన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, రవీంద్ర, నారాయణస్వామి, రామలింగం, లోక్‌నాథ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ఆదినారాయణ



ప్రకాష్

నల్లమాడ: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. అధ్యక్షుడిగా టి. ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా టి. ప్రకాష్, ఆర్థిక కార్యదర్శిగా ఎస్. శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ఎస్. మనోహర్, కే. పుష్పావతి, కార్యవర్గ సభ్యులుగా కే. విశ్వనాథ్, శశికుమార్‌రెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యులుగా కె. ప్రభాకర్, శ్రీరాములునాయక్, సీపీఎస్ కన్వీనర్‌గా బి. అనిల్‌కుమార్, మైనార్టీ కన్వీనర్‌గా కె. సైపుద్దీన్ బాషా, మహిళా కన్వీనర్లుగా రేణుకాబాయి, రీనా చవాన్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల అధికారులుగా ఎస్టీయూ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రాంమోహన్, పరిశీలకులుగా నల్లచెరువు నాయకులు ఖలీల్ రెహమాన్ వ్యవహరించారు.